


TELTEL/2021/81472

# ప్రభ

దినపత్రిక

ప్రజ శ్రేయస్సే - ప్రభ లక్ష్యం




విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా ప్రభ దినపత్రికలో బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

ప్రభ సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9642555562



ఎడిటర్ -భైరోజు కిషోర్ చారి | తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి - 4 | సంచిక- 122 | ఆదివారం | 22-6-2025 | పేజీలు- 8 | వెల రూ 5

## ప్రపంచ శాంతికి

# యోగా దిక్సూచి


### ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక

- విశాఖ తీరంలో యోగాసానాలు వేసిన లక్షలాది జనం
- ప్రత్యేక అతిథిగా హాజరై యోగాసనాలు చేసిన ప్రధాని
- యోగా ప్రపంచాన్ని ఏకం చేసిందని మోడీ వ్యాఖ్య

**విశాఖపట్టణం, -21జూన్-ప్రభ**

విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. లక్షలాదిగా జనం తరలివచ్చి ఉత్సాహంగా యోగాలో పాల్గొన్నారు. కిలోటర్ల మేర యోగా చేస్తూ ఉత్సాహంగా కనిపించారు. విశాఖ ఆర్కే బీచ్ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకగా ముగిసింది. లక్షలాది మంది సాగర తీరానికి చేరుకుని యోగాసనాలు వేశారు. ప్రధాని నరేంద్ర -మిగతా 2 లో







## ఇరాన్ పై దాడులు మోడీ మౌనం విడాలి

- ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు సమర్ధనీయం కాదు
- భారత్ దౌత్యనీతిని ప్రదర్శించాలి : సోనియా

**న్యూఢిల్లీ,-**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఖండించారు. మోడీ ప్రభుత్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ విషయంలో భారత్ మౌనం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతపై సోనియా గాంధీ స్పందించారు. భారత్ చారిత్రక నైతిక స్థైర్యాన్ని కోల్పోయిందని.. మానవ హక్కుల ఉల్లంఘనలపై మౌనం బాధాకరమన్నారు. అంతర్జాతీయ మానవతా బాధ్యతను గుర్తు చేశారు. ఈ మేరకు సోనియా గాంధీ ఓ వ్యాసం రాశారు. -మిగతా 2 లో



## దేశంలో తెలంగాణలోనే స్టార్టప్ విజయవంతమైంది

- నాడు అన్ని కంపెనీలను సులువుగా అనుమతులు
- దేశంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉంది : కేటీఆర్

**హైదరాబాద్, -21జూన్-ప్రభ**

స్వతంత్ర భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో తెలియడానికి తెలంగాణనే నిదర్శనం అని అన్నారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో తెలంగాణ విజయగాథను కేటీఆర్ వినిపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటం తర్వాత 2014లో తెలంగాణ ఏర్పడింది. -మిగతా 2 లో

## 22 వేల మంది రైతులకు

# రైతుభరోసా ఎగవేత

- వారికి వెంటనే రైతు భరోసా సాయం అందించాలి
- లేకుంటే 22వేల మందితో ఓఆర్ఆర్ దిగ్బంధిస్తాం
- జిన్నారం రైతు ధర్నాలో హరీష్ రావు హెచ్చరిక



**సంగారెడ్డి,-21జూన్-ప్రభ**

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఇవ్వకపోతే ఓఆర్ఆర్‌ను దిగ్బంధం చేస్తామని బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 22 వేల మంది రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదన్నారు. 22 వేల మంది రైతు కుటుంబాలతో ఓఆర్ఆర్ పై వంటావార్పు చేసి బంద్ చేస్తామని ప్రకటించారు. శనివారం సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన జిన్నారంలో ఏర్పాటు చేసిన రైతుల మహా ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా డబ్బులు ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ఏర్పాటు చేసి, వారిని ఆర్థికంగా అభివృద్ధి -మిగతా 2 లో



## హైడ్రా అంటే కూల్చివేతలు కాదు

- పర్యావరణరహిత నగరాభివృద్ధికి కృషి
- రుణాలు ఇచ్చేముందు బ్యాంకర్లు వివరాలు చూడాలి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ

**హైదరాబాద్ -21జూన్-ప్రభ**

సొంతింటి కలను సాకారం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమైందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఇల్లు కొనేందుకు రుణాలిచ్చే ముందు అన్ని విధాలా సరి చూసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ వాల్యుయర్స్, రిజిస్టర్డ్ వాల్యుయర్స్ ఫౌండేషన్, ఎక్షు హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ట్రాన్స్‌ఫర్‌మేటివ్ ఎరాలో వాల్యుయేషన్' అంశంపై జరిగిన జాతీయ -మిగతా 2 లో

## విద్యుత్ రంగంలో తెలంగాణ దేశానికి

# దిక్సూచి కావాలి

### ప్రభుత్వం, విద్యుత్ సిబ్బంది ఒక ఆదర్శ కుటుంబం



- భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలి
- విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు శాతం డిఎ పెంపు
- 71,417 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం
- పెంచిన డిఎ ఈ సంవత్సరం జనవరి నుంచి అమల్లోకి

**హైదరాబాద్ --21జూన్-ప్రభ**

విద్యుత్ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి దిక్సూచిగా నిలవాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం -మిగతా 2 లో

## పాడి కౌశిక్ రెడ్డి కి ఊరట

- షరతులతో కూడిన బెయిల్ మంజూరు




**వరంగల్**

హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట లభించింది. కౌశిక్‌రెడ్డి రిమాండ్‌ను తిరస్కరించిన న్యాయస్థానం అతనికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. క్వారీ యజమానిని బెదిరించిన కేసులో పోలీసులు అతన్ని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కాజీపేట రైల్వే కోర్టులో -మిగతా 2 లో

## జనాభా పెరుగుదలే అభివృద్ధికి ఆటంకం

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



**న్యూఢిల్లీ,**

ఆర్థికంగా దేశం బలపడకపోవడానికి దేశ జనాభా కారణమని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అభిప్రాయపడ్డారు. తలసరి ఆదాయం విషయంలో ప్రపంచంలో తొలి పది దేశాల్లో భారత్ ఎందుకు లేదని అడిగిన ఓ ప్రశ్నకు స్పందిస్తూ.. దేశ జనాభా ఇందుకు కారణమన్నారు. జనాభా నియంత్రణను భాషా లేదా మతపరమైన -మిగతా 2 లో

## విరుచుకు పడుతున్న ఇజ్రాయిల్

### మరో ముగ్గురు ఇరాన్ టాప్ కమాండర్ల హతం



**టెహ్రాన్,--21జూన్-ప్రభ**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులతో విరుచుకుపడుతోంది. ఈ దాడుల్లో ఇప్పటికే పలువురు కీలక నేతలు, అణు శాస్త్రవేత్తలను కోల్పోయిన ఇరాన్ తాజాగా మరో ముగ్గురు టాప్ కమాండర్లను కోల్పోయింది. -మిగతా 2 లో

## ఇరాన్ పై దాడులుమోడీ మౌనం విడాలి

(మొదటి పేజీ తరువాయి)
దాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోషల్ మీడియా ఎలాట్‌ఫామ్‌లో పంచుకున్నారు. ఇరాన్ భారతదేశానికి మిత్ర దేశమని, ఇరు దేశాల మధ్య సంబంధాలు ఎల్లప్పుడూ బాగానే ఉన్నాయని సోనియా గాంధీ ఆ వ్యాసంలో పేర్కొన్నారు. ఇరాన్- భారత్ మధ్య స్నేహానికి ఉదాహరణగా.. 1994 నాటి జమ్మూ కశ్మీర్ సమస్యను గుర్తు చేశారు. 1994లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్‌లో కశ్మీర్ అంశంపై భారతదేశాన్ని విమర్శించే తీర్మానాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ తీర్మానాన్ని నిరోధించడంలో ఇరాన్ సహాయపడిందన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా భారత్- ఇజ్రాయెల్ మధ్య వ్యూహాత్మక సంబంధాలు బలపడుతున్నాయని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఈ ప్రత్యేక పరిస్థితిలో.. శాంతి, సంభాషణల వారధిగా మారడానికి భారతదేశానికి దౌత్య శక్తి, నైతిక బాధ్యత ఉందని ఆమె అన్నారు. ఇది కేవలం ఒక వియుక్త సూత్రం కాదని, పశ్చిమాసియా దేశాలలో నివసిస్తున్న.. పౌరులందరి భద్రతకు సంబంధించిన విషయం అని స్పష్టం చేశారు. వారి భద్రతను తీవ్రంగా పరిగణించి, ప్రభుత్వం విదేశీ దౌత్యంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని కోరారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ పై హమాస్ జరిపిన దాడిని సోనియా గాంధీ ఖండించారు. హమాస్ పై ఇజ్రాయెల్ జరిపిన ప్రతీకారం.. భయంకరమైనదిగా, అసమానమైనదిగా అభివర్ణించారు. ఈ దాడిలో ఎన్నో ఇళు ్ళ, కుటుంబాలు, ఆసుపత్రులు నాశనమయ్యాయని.. 55,000 మందికి పైగా పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇంత భయంకరమైన దాడిని చూసి కూడా భారత్ మౌనంగా ఉండట కూడదన్నారు. ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధంలో భారత్ కల్పించుకోకపోవడాన్ని ఆమె విలువ లొంగుబాటుగా ఉన్నదని విమర్శించారు. ఈ విషయంలో భారత్ వైఖరి స్పష్టంగా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను అనుసరించాలని ఆమె సూచించారు.

## జనాభా పెరుగుదలే అభివృద్ధికి ఆటంకం

(మొదటి పేజీ తరువాయి)
సమస్యగా కాకుండా ఆర్థిక సమస్యగా చూడాలన్నారు. చాలా అభివృద్ధి జరుగుతున్నా.. ఫలితాలు మాత్రం అందరికీ అందడం లేదన్నారు. ఇందుకు జనాభా పెరుగుదలే కారణమన్నారు. గత రెండు పర్యాయాల్లో మోదీ ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను ఈ సందర్భంగా గడ్కరీ ప్రస్తావించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన పాత్రపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 11 ఏళ్లలో చూసింది కేవలం న్యూస్ రీల్ మాత్రమేనని, అసలైన సినిమా ఇంకా మిగిలే ఉందని వ్యాఖ్యానించారు. ఏదేమైనా తాను చేయాల్సిన పనులను పార్టీ నిర్ణయిస్తుందని, ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'ఇప్పటివరకు చూసిందంతా న్యూస్ రీల్ మాత్రమే. అసలైన సినిమా ఇంకా ప్రారంభం కాలేదు. కార్యకర్తలు ఏం చేయాలి, బాధ్యతలు ఏంటనే విషయాన్ని పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీ అప్పగించిన బాధ్యతలను నేను నిర్వర్తిస్తా. ఇటీవల రోడ్ల పనుల కంటే వ్యవసాయం ఇతర సామాజిక కార్యక్రమాలపై నేను ఎక్కువగా దృష్టి సారిస్తున్నా' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 11ఏళ్ల మోదీ పాలన గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. విదర్భలో రైతుల ఆత్మహత్యలను ఆపేందుకు కృషి చేయాలన్నదే తన కోరిక అన్నారు.

## విరుచుకు పడుతున్న ఇజ్రాయిల్

(మొదటి పేజీ తరువాయి)
దీంతో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కు గట్టి దెబ్బ తగిలింది. ఈ దాడుల్లో మృతి చెందిన కమాండర్లలో ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ ఆయుధ సరఫరా విభాగం కమాండర్ బెహ్నామ్ షాహ్రియారీ కూడా ఉన్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. ఇజ్రాయెల్ సరిహద్దు నుంచి 1,000 కిలోమీటర్ల దూరంలోని పశ్చిమ ఇరాన్‌లో బెహ్నామ్ షాహ్రియారీ నడుపుతున్న వాహనంపై బాంబు దాడి జరపడంతో అతను హతమైనట్టు ఐడీఎఫ్ ధ్రువీకరించింది. ప్రాక్సీలకు ఇరాన్ ఆయుధాల స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షించడంలో ఇతను కీలకవ్యక్తిగా ఉన్నట్టు తెలిపింది. లెబనాన్‌లో హెజ్‌బుల్లా, గాజాలో హమాస్, యెమెన్‌లో హౌతీ మిలీటియాకు నేరుగా ఆయుధాల సరఫరాలో ఇతని ప్రమేయం ఉంది. ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణల్లో ఇజ్రాయెల్ పౌరులు, సైనిక బలగాలపై ప్రయోగించిన రాకెట్లు, క్షిపణులను సరఫరా చేయడంలో సాహ్రియారీ పాత్ర కీలకమని ఐడీఎఫ్ తెలిపింది. కాగా, ఇజ్రాయెల్ శనివారం ఉదయం జరిపిన మరో దాడిలో ఖుద్స్ ఫోర్స్ పాలస్తీనా డివిజన్ హెచ్ సయీద్ ఇజాదీ మరణించాడు. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న మమాస్ మారణహోమానికి పాల్పడడానికి ముందు ఈ ఘటనకు ఎ÷-లానింగ్, వనరుల సరఫరా వంటివి ఇజాదీ చేసినట్టు ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. శనివారంనాడే ఇరాన్‌కు చెందిన మరో కమాండర్ అమిన్ పౌర్ జోడకీ కూడా హతమైనట్టు పేర్కొంది. ఐఆర్‌జీసీ సెకెండ్ డ్రోన్ యూనిట్‌కు ఇతను డిప్యూటీ కమాండర్‌గా ఉన్నట్టు తెలిపింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఈ దాడులు చేపడుతోంది.

## హైడ్రా అంటే కూల్చివేతలు కాదు

సదస్సులో రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
సుస్థిర వ్యాపారానికి హైడ్రా దోహదం చేస్తోందని అందరూ గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి మోసాలకు ఆస్కారం లేకుండా సొంతింటి కలను సాకారం చేయడంలో రియల్ ఎస్టేట్ సంస్థలతో పాటు, ఆ ఇంటికి రుణాలు ఇచ్చే అర్థిక సంస్థలు కూడా బాధ్యత వహించాలని రంగనాథ్ సూచించారు.గతేడాది జులై 19న హైడ్రా ఏర్పడిందని.. అంతకుముందు వెలసిన నివాస ప్రాంతాలతో పాటు, అనుమతులు పొంది నిర్మాణ దశలో ఉన్న వాటి జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామన్నారు. హైడ్రా అంటే కూల్చివేతలు కాదు.. పర్యావరణ హితమైన నగరాభివృద్ధికి దోహదం చేసే సంస్థగా అందరూ గుర్తిస్తున్నారని వివరించారు. సర్వే నంబర్ ఒకటి చూపించి.. వేరే చోట ఇళ్ల నిర్మాణం చేపడుతున్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్థిక సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలకు ఆస్తి విలువలను నిర్ణయించడంలో పారదర్శకత, నమ్మకం, కచ్చితత్వాన్ని నిర్ధరించడంలో వాల్యుయేషన్ నిపుణుల పాత్ర చాలా కీలకమైందన్నారు. స్థిరాస్తుల విలువ నిర్ధరించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత ఉపయోగంగా ఉన్నా.. క్షేత్రస్థాయి పరిశీలన కూడా అంతే ముఖ్యమన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి.. వరద ముప్పులేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలనేది

# ప్రపంచ శాంతికి యోగా దిక్సూచి

(మొదటి పేజీ తరువాయి)
మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. ప్రపంచ రికార్డులు నెలకొల్పడమే లక్ష్యంగా యోగా కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రధానికి సీఎం చంద్రబాబు జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ... 'అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యోగా ప్రపంచ దేశాలను ఏకం చేసిందని, ఆ ఘనత భారత్‌కు దక్కిందన్నారు. యోగా దినోత్సవ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతిచ్చాయి. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. యోగా అనేది మానవతను పెంచే సామూహిక పక్రియ అన్నారు.. గత పదేళ్లలో కోట్ల మంది జీవితాల్లో యోగా వెలుగులు నింపింది. గ్రామగ్రామాల్లో యువకులు యోగాను అనుసరిస్తున్నారు. యోగాకు వయసుతో పనిలేదు.. యోగాకు హద్దులు లేవు' అని మోదీ అన్నారు. 'ప్రకృతి సౌందర్యానికి, ప్రగతికి చిరునామా విశాఖపట్నం. ప్రకృతిలో మనిషి భాగస్వామి అని యోగా గుర్తు చేస్తుంది. యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది. యోగా ద్వారా నేను అన్న భావన మనంగా మారుతుంది. మనం అన్న భావన మానవత్వాన్ని పెంచుతుంది. ప్రపంచంలో అశాంతి, అస్థిరత పెరుగుతున్నాయి. యోగా వల్ల శాంతి స్థిరత్వం సాధించవచ్చు' అని మోదీ పేర్కొన్నారు. నెలన్నర రోజుల్లో యోగాంధ్రను విజయవంతం చేయడంలో మంత్రి లోకేశ్ పాత్ర కీలకమైందని.. కొత్త కార్యక్రమాల రూపకల్పనలో ఆయన చొరవ ప్రశంసనీయమని ఈ సందర్భంగా మోదీ కొనియాడారు. 'యోగా కేవలం వ్యాయామం కాదు.. అదొక జీవన విధానం. ఈ ఏడాది విశాఖలో యోగ దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం అద్భుతం' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

## దేశంలో తెలంగాణలోనే స్టార్టప్ విజయవంతమైంది

(మొదటి పేజీ తరువాయి)
స్వతంత్ర భారతంలో అద్భుతమైన ఆర్థిక పురోగతి, ప్రగతిని చూపించిన రాష్ట్రం తెలంగాణ. అహింసాయుతంగా జరిగిన ఒక మహా అద్భుత పోరాటం తెలంగాణ ఉద్యమం. తెలంగాణ విజయాన్ని కేవలం అంకెలతో మాత్రమే చెప్పుకుంటే సరిపోదు. ఆత్మగౌరవం, పట్టుదలకు ప్రతిరూపంగా చెప్పుకోవడంతో పాటు లక్షలాది మంది భారతీయులకు భవిష్యత్తుపై భరోసాను ఇచ్చిన విజయగాథ లాగా తెలంగాణను చూడాలి. సబ్బండ వర్ణాల భాగస్వామ్యంతో సాధించిన సమ్మిళిత వృద్ధిలాగా తెలంగాణ విజయాన్ని చెటప్పుకోవచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉంది. 2015 నుంచి 2019 మధ్య కాలంలో కేవలం నాలుగు సంవత్సరాల స్వల్ప కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశాము. అమెరికా అవతల హైదరాబాద్‌లోనే అమెజాన్ అతిపెద్ద క్యాంపస్ ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ-హబ్ హైదరాబాద్‌లో ఉంది. ప్రపంచంలోని మూడో వంతు వ్యాక్సిన్ ఉత్పత్తి తెలంగాణలో జరుగుతుంది. ప్రపంచంలోనే ఐదు అతి పెద్ద టెక్ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లోనే తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేశాయి. ఐటీ రంగ ఉద్యోగ కల్పనల్లో వరుసగా రెండు సంవత్సరాల పాటు బెంగళూరుని హైదరాబాద్ దాటింది అని కేటీఆర్ గుర్తు చేశారు. కొత్త రాష్ట్రంగా శిథిలాల నుంచి గెలుపు సౌధాలను తెలంగాణ నిర్మించింది. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో మేము తెలంగాణ రాష్ట్రంగా నూతన ప్రయాణాన్ని మొదలుపెట్టాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే అనుమతుల కోసం ఎన్ని రోజులు పడుతుందో ఎవరు చెప్పలేని పరిస్థితి ఉండేది. కానీ మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 రోజుల్లో అనుమతులు వచ్చేలా చేశాం. ఒకవేళ 15 రోజుల్లో లోపు అనుమతులు రాకపోతే ఆ పరిశ్రమను ప్రారంభించుకోవచ్చు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి అవకాశం లేదు అని కేటీఆర్ తెలిపారు. వ్యక్తుల కంటే విధానాలకే మేం ప్రాధాన్యత ఇచ్చాము. భారతదేశంలోని 65 శాతం ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. అందుకే మేము వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాము. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా దాదాపు రూ. 75 వేల కోట్లు జమచేసిన రాష్ట్రం దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేదు. మేం తీసుకొచ్చిన ఈ పథకం అద్భుత ఫలితాలను ఇచ్చింది. అందుకే 2014లో ధాన్యం ఉత్పత్తిలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణ పంజాబ్, హర్యానా దాటి 2022 నాటికి నంబర్ వన్‌కు చేరింది అని కేటీఆర్ తెలిపారు. బటర్ ఫ్లై ఎఫెక్ట్ గురించి చెప్పుకున్నట్టే కేసీఆర్ ఎఫెక్ట్ గురించి కూడా చెప్పుకోవాలి. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుంది అనడానికి తెలంగాణ విజయగాథనే నిదర్శనం. కోటి ఇండ్లకు శుద్ధి చేసిన తాగునీటిని అందించిన ఏకైక రాష్ట్రం భారతదేశంలో తెలంగాణ ఒకటి. 80 మీటర్ల సముద్ర మట్టం నుంచి 618 మీటర్లకు నీటిని తీసుకెళ్లే ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఇన్ లాండ్ ఫిషరీస్‌లో తెలంగాణ నెంబర్ వన్. పారిశ్రామిక అవసరాల కోసం తగినంత నీటిని అందుబాటులో ఉంచిన రాష్ట్రం తెలంగాణ.

## 22వేల మంది రైతులకు రైతుభరోసా ఎగవేత

(మొదటి పేజీ తరువాయి)
చేశారన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరగకుండా భరోసా కలిపించారన్నారు.రైతులు వ్యవసాయ భూముల్లో పంటలు సాగు చేస్తున్నా ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు చెల్లించడం లేదన్నారు. కేసీఆర్ రైతులకు ఎకరానికి రూ.10 వేలు రైతు భరోసా డబ్బులు ఇవ్వడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఫించన్ నెలకు రూ.2 వేలు ఇవ్వగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.4వేలు ఇస్తామని హామీ ఇచ్చారని.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలలో రైతులకు వ్యవసాయం కోసం 24 గంటలు నాణ్యమైన కరెంట్ సరఫరా చేసిందన్నారు. కరెంట్ కోతలు లేకుండ సరఫరా చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలు ప్రారంభమైన్నాయని ఆరోపించారు. అనుముల రేవంత్‌రెడ్డి కాదు కోతల రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. పటాన్‌చెరు ప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులు పంటలు సాగు చేసేందుకు అప్పులు చేసుకోనే పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల కుటుంబాలు అప్పుల పాలు కావడం జరిగిందన్నారు. రైతు భరోసాను ఎన్నిక భరోసాగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అందరికి ఇస్తామని ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగిలో రైతులకు రైతు భరోసా డబ్బులు వేయలేదని, మండలంలో ఒక్క గ్రామంలో ఉన్న రైతులకు వేశారన్నారు . ఓట్లు కోసం రైతు బంధు పథకంలో డబ్బులు వేస్తామని ప్రకటన చేశారని ఆరోపించారు. ఒక రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రైత భరోసా డబ్బులు రూ. 12 వేలు బాకి ఉందని, ముందుగా రైతులకు బాకీ ఉన్న రూ.12 వేలు వేయాలని డిమాండ్ చేశారు. రైతులను చైతన్యం చేసి రైతు భరోసా కోసం పోరాటం చేస్తామన్నారు. దేవుండ్ల మీద ఒట్టు వేసి హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కటి అమలు చేయలేదన్నారు. రైతుల పంట రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ఇంత వరకు అమలు చేయలేదన్నారు. బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తీసుకోనే పరిస్థితి వచ్చిందన్నారు. రైతులు పంటలు సాగు చేసేందుకు రూ.3 వడీకి అప్పులు తీసుకోనే పరిస్థితి వచ్చిందన్నారు. రైతులు తీసుకోన్న పంట రుణాలు చెల్లించి, తిరిగి కొత్త రుణాలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి తెలుపడంతో ఎంతో మంది రైతులు బ్యాంకులో ఉన్న అప్పులు చెల్లించారన్నారు. అప్పులు చెల్లించిన రైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. రైతులకు భరోసా కలిపించేందుకు కేసీఆర్ రైతు బీమా పథకంను అమలు చేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. రైతులు చనిపోతే కేసీఆర్ ప్రభుత్వం రైతు కుటుంబానికి రూ.5 లక్షల భీమా డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. రైతులకు భాకీ ఉన్న రూ.12 వేలు ముందుగా రైతుల ఖాతాలో జమా చేస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పంటల బీమా పథకం అమలు చేస్తామని ప్రకటించి ఇంత వరకు అమలు చేయడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశంలో పంటల బీమా పథకంను అమలు చేస్తామని ప్రకటించి, మాట తప్పడం జరిగిందన్నారు. కేసీఆర్ ఇచ్చిన పథకాలను బంద్ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వికారాబాద్, గద్వాల్ జిల్లాలో రైతులు పంట భూములు తీసుకోరాదని పోరాటం చేస్తే బేడిలు వేసి జైల్లో పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంకు గుణపాఠం చెపేందుకు రైతులు సిద్దంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో రైతు రాజ్యం కాదు బేడీల రాజ్యం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూములు కొనుగోలు చేసేందుకు రియల్ వ్యాపారులు వచ్చే వారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత అవసరం కోసం భూములు అమ్మకం చేస్తామని తెలిపినా ఎవరు ముందుకు రావడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్‌కు రావడంతో ఎమ్మెల్యే మాణిక్‌రావు నియోజకవర్గ అభివృద్ధి కోసం గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేయాలని కోరిన ఒక పైసా ఇవ్వలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు.

## పాడి కౌశిక్ రెడ్డి కి ఊరట

(మొదటి పేజీ తరువాయి)
హాజరుపర్చారు. 41ఏ నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేశారని కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌశిక్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. భారాస నేతల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆరోపించారు. కాజీపేట కోర్టు.. కౌశిక్‌రెడ్డి రిమాండ్‌ను తిరస్కరించిన అనంతరం భారాస నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై కౌశిక్‌రెడ్డి పోరాడుతున్నందుకే అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రెండేళ్ల క్రితం కేసులో అరెస్టు చేసి, కుట్ర పూరితంగా సెక్షన్లు మార్చారని ఆరోపించారు. పోలీసులు పెట్టిన సెక్షన్లు సరైనవి కావని తమ న్యాయవాదులు వాదించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించినా కోర్టులో న్యాయం జరిగిందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తామంతా ప్రజల్లో ఉండి పోరాడుతామన్నారు.

## విద్యుత్ రంగంలో తెలంగాణ దేశానికి దిక్సూచి కావాలి

(మొదటి పేజీ తరువాయి)
ఆయన ప్రజాభవన్లో విద్యుత్ ఉద్యోగులకు డి ఎ ప్రకటించి ప్రసంగించారు.;ఉద్యోగుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయం ఇందులో భాగంగా విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు 1.944 శాతానికి డిఏ నీ పెంచి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్ప మనసుతో తీసుకున్న నిర్ణయం ఫలితంగా రాష్ట్రంలోని 71,417 ఇది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ పెంచిన డిఏ విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్ల తోపాటు ఆర్టిజన్స్ కు వర్తిస్తుందని అన్నారు. గతంలో 14.074% గా ఉన్న %ణూ% ను 16.018% శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పెంచిన డిఏ ఈ సంవత్సరం జనవరి నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. పెంచిన డీఏతో విద్యుత్ సంస్థపై ప్రతి నెల 11.193 కోట్ల రూపాయల భారం పడుతుందని తెలిపారు. అయినా ఉద్యోగుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు.మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో పోటీ ప్రపంచంలో ప్రతి ఉత్పత్తికి విద్యుత్తు అనివార్యం అయ్యింది అన్నారు. గత ప్రభుత్వ కాలంలో 2023 మార్చిలో 15 వేల మెగావాట్ల పీక్ డిమాండ్ రాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2025 మార్చిలో 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చింది, గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే అదనంగా 2000 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చింది. అయినప్పటికీ ప్రభుత్వం, విద్యుత్ ఉద్యోగులు ఓ కుటుంబం మాదిరిగా శ్రమించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరాను చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యుత్ డిమాండ్ తీవ్రంగా పెరగనుంది రాష్ట్రంలో 2029-30 నాటికి 26,299 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడనుంది, 2034-35 నాటికి 33, 773 మెగావాట్ల డిమాండ్ ఏర్పడుతుందని కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదిక ఇచ్చిందని వివరించారు.

# సకాలంలో వైద్యం అందక కొల్లూరు ఫేస్.2, కెసిఆర్ డబల్ బెడ్ రూమ్ ప్లాట్ నివాసి మృతి





### సరైన వస్తువులకు నోచుకోలేని కొల్లూరు ఫేస్..2 కెసిఆర్ డబల్ బెడ్ రూమ్ నివాసులు
### -సరైన ఆసుపత్రులు , వసతులు లేకపోవడమే కారణం అంటున్న స్థానికులు

**పటాన్ చెరు జూన్ 21,ప్రభ :** కొల్లూరు ఫేస్..2 కెసిఆర్ డబల్ బెడ్ రూమ్ బ్లాక్ 87 ప్లాట్ నెంబర్ 504 చెందిన శ్రీనివాస్ సకాలంలో వైద్యం అందక మృతి చెందాడు . శనివారం ఉదయం ఆయనకు ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు అంబులెన్స్ కోసం ప్రయత్నించారు. అంబులెన్స్ సిబ్బంది స్పందించక పోవడంతో ఇతర వాహనంలో ఆసుపత్రికి తరలించే లోపు శ్రీనివాస్(45) మార్గమధ్యంలో మృతి చెందాడు . సమీపంలో సరైన ఆసుపత్రులు , వసతులు లేకపోవడమే శ్రీనివాస్ మృతికి కారణమంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ కన్నీరుమున్నీరైయ్యారు. నిరుపేదలైన తమకు సొంతిల్లు దక్కిందన్న ఆనందం వసతులు లేని రెండు పడకల ఇంటికి వచ్చి తమ తండ్రి ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఇచ్చిన నివాసాలలో కనీస వసతులు లేకపోవడం దురదృష్టకరమన్నారు. విషయం తెలుసుకున్న కొల్లూరు ఫేస్.2 కు చెందిన ఇంచార్జి లు ,అధ్యక్ష, కార్యదర్శులు, నివాసితులు పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రీనివాస్ అంతక్రియలను నిర్వహించారు.

**వసతులు కరవడంతోనే శ్రీనివాస్ మృతి చెందాడు : కొల్లూరు ఫేస్..2 నివాసితులు**

కొల్లూరు ఫేస్..2 కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ నివాసితులకు సరైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని పలువురు అధ్యక్ష ,కార్యదర్శులు , నివాసితులు ఆరోపించారు. ఆనాటి కెసిఆర్ ప్రభుత్వ హయాంలో పేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ లలో కనీస సదుపాయాలను సైతం ఏర్పాటు చేయడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.



117 బ్లాక్ లలో 15 వేల కు పైగా కుటుంబాల నివసముండే కాలనీలో అత్యవసర ఆసుపత్రి, ప్రభుత్వం అంబులెన్స్, స్మశానవాటికలు, సెక్యూరిటీ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ఇతరత్రా సదుపాయాలు ఏర్పాటు చేయకుండానే ప్రభుత్వ అధికారులు లబ్ధిదారులను భయభ్రాంతులకు గురి చేస్తూ నివాసాలలో ఉండాలంటూ హెచ్చరిస్తున్నారు. వాళ్ల మాటలకు భయపడిన లబ్ధిదారులు కేటాయించిన ఇండ్లలో ఉండడంతో గత తొమ్మిది నెలల నుంచి సుమారు 25 మంది వివిధ కారణాల చేత అనారోగ్యంతో సకాలంలో వైద్య సేవలు అందక మృతి చెందినట్లు నివాసతులు పేర్కొన్నారు. వసతులను కల్పించాల్సిన అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గత కొన్ని రోజులుగా ఇదే విషయమై వివిధ విభాగాల ఉన్నతాధికారులకు వినతి పత్రాలను అందిస్తూ వసతులను, సౌకర్యాలను కల్పించాలంటూ కొల్లూరు.2 నివాసితులు పలుమార్లు వినతులను అందించిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అది కాదన్నట్లు కొల్లూరు ఫేస్.02 నివాసితుల నుంచి గత ఏడాది భారీగా పన్ను లు విధించి వసూలు చేయడంతో పాటుగా ఈ ఏడాదికి చెందిన నోటీసులను సైతం అందజేశారు .అదే విధంగా గత అక్టోబర్ నుంచి జూన్ వరకు విద్యుత్ కు సంబంధించిన ఒక్కో బ్లాక్ కు లక్షల రూపాయల్లో బిల్లులను కేటాయించారు. పేదల నుంచి అన్ని రకాల పన్నులను, విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వము, ప్రభుత్వాధికారులు వసతులను కల్పించడంలో మాత్రం విఫలం అవుతున్నారు. ప్రతి ఒక్కరు వచ్చి తమకు కేటాయించిన ప్లాట్లలో నివాసం ఉండాలని హెచ్చరించే అధికారులు వారికి కావలసిన వసతులను కల్పించడం పట్ల ఆసక్తి చూపడం లేదు. ఇక స్థానిక ప్రజాప్రతినిధులు సైతం కొల్లూరు ఫేస్.02 కు చెందిన నివాసితుల సమస్యలను కనీసం తెలుసుకునే ఆసక్తి చూపకపోవడం గమనార్హం. ఎన్నికలవేళ ఎవరైనా కొల్లూరు ఫేస్.02 నివాసతుల ఓట్లు అడిగేందుకు ప్రయత్నిస్తే వారిని తరిమికొట్టేందుకు సైతం నివాసితులు సిద్ధమైనట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం కొల్లూరు ఫేస్..02 నివాసితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పేదలకు కేటాయించిన నివాసాలలో కావలసిన వసతులను తక్షణమే కల్పించాలని కొల్లూరు ఫేస్ టు చెందిన అధ్యక్ష ,కార్యదర్శులతో పాటుగా నివాసితులు హెచ్చరించారు. లేని పక్షంలో 117 బ్లాక్ లకు చెందిన అధ్యక్ష కార్యదర్శులతో పాటుగా నివాసితులు అందరూ కలిసి రోడ్డుపైకి వచ్చి భారీ ధర్నా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు కొల్లూరు.02 డబల్ బెడ్ రూమ్ నివాసితుల సమస్యల పరిష్కారానికి కదలి రావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# యోగాతో ఎన్నో మానసిక ఆరోగ్య ప్రయోజనాలు

### - టిడిపి అరకు పార్లమెంటు కార్యదర్శి మువ్వా శ్రీనివాస్
### - ఎటపాక వైటిసిలో ఘనంగా యోగాంధ్రా కార్యక్రమం




**ఎటపాక : జూన్ 21 ( ప్రభ):** యోగ సాధనతో ఎన్నో ఆరోగ్య మానసిక ప్రయోజనాలు ఉన్నాయని టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి మువ్వ శ్రీనివాస్ , ఎంపీడీవో ప్రేమ్ సాగర్ అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వైటిసి ప్రాంగణంలో యోగ సాధన చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా సాధన చేస్తే మానసికంగా ఆరోగ్యంగా ఎంతో ఉత్తేజంగా ఉంటామని తెలిపారు. యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని ఎంతో ఆరోగ్య ఆధ్యాత్మిక ప్రయోజనాలను చేకూరుస్తుందని శ్వాస వ్యాయామాలతో కూడుకొని మనుషులలో ఉన్నటువంటి ఒత్తిడిని ఆందోళనను తగ్గించి నిరాశ నిస్పృహల నుండి బయటికి తీసుకువస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎటపాక ఈవోపీఆర్డి శ్రీకాంత్ రెడ్డి , సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు , మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్ , సెక్రెటరీ పద్మావతి , బిజెపి యువమోర్చా నాయకులు మూడే సతీష్ నాయక్ , సచివాలయం సిబ్బంది , స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది , కస్తూర్బా విద్యార్థినిలు , అంగన్వాడీ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

# బూర్గంపహడ్ తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడి.



**బూర్గంపాడు : జూన్ 21 ( ప్రభ):** స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో టైపిస్ట్ కంప్యూటర్ ఆపరేటర్ సిహెచ్ నవక్రాంత్ రేషన్ కార్డ్ అప్లోడ్ చేసి ప్రాసెస్ చేయడానికి 4 వేలు లంచం డిమాండ్ చేసాడు దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు.ఈరోజు రూ 2500 నవక్రాంత్ తీసుకుంటుండగా ఎసిబి డిఎస్పి వై రమేష్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

# ఘనంగా యోగ దినోత్సవం






**నారాయణఖేడ్,జూన్ 21 ప్రభ:** అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని శనివారం నారాయణఖేడ్ లో ఘనంగా నిర్వహించారు.యోగాదినోత్సవాన్ని ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులచేత నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతీ ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో నిర్వహించారు. ఉదయం తరగతులు ప్రారంభానికి ముందే ఆట స్థలాలు,తరగతి గదులు,వరండాలలో పిఈటిలు విద్యార్థులచేత ఆసనాలు వేయించారు.యోగ వల్ల కలిగే లాభాలు విద్యార్థులకు వివరించారు.

## రైతులకు శుభ సూచకం ఆరుద్ర పురుగు

# ఎరువుల వాడకంతో కనుమరుగు

రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

దేవతలకు, వరుణ దేవుడికి ప్రతిరూపంగా, తమకు శుభ సూచకంగా రైతులు భావించే, ఆరుద్ర పురుగులు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి..
ఆరుద్ర నక్షత్రములలో ఆరవది. రాశి చక్రములలో, "ఆరుద్ర" నక్షత్రం యొక్క నాలుగు పాదములు, "మిధున (జెమిని) రాశికి చెందుతాయి.
వ్యవసాయ పనులు ప్రారంభించ దానికి, "ఆరుద్ర కార్తె" అనుకూలమైనది. ఈ కార్తెలో మాత్రమే కనబడేది ఆరుద్ర పురుగు. ఇది మొఖమల్ బట్టను చుట్టుకున్నట్లుగా ఉండి, ఎర్రగా బుర్రగా, బొద్దుగా ఉంటుంది. అందంగా ఉండే ఈ పురుగు పంటలకు ఎలాంటి హానీ చేయదు. ఏడాదికి ఒకసారి మాత్రమే ప్రత్యక్షమౌతుంది. "ఇట్టే వచ్చి, అట్టే మాయమౌతావు, ఆరుద్ర పురుగుకు మల్లే." అని తెలుగు నాట, ఒక జాతీయము మిగుల ప్రాచుర్యములో ఉంది. ఆరుద్ర పురుగును కొన్ని చోట్ల "పట్టు పురుగు" అనీ, "చందమామ పురుగు " అనీ, "లేడీ బర్డ్" అనీ, "ఇంద్రగోప పురుగు" అని కూడా అంటారు. ఇలా చాలా పేర్లను కలిగి ఉన్న ఈ పురుగు చూడటానికి అరంగుళం సైజులో ఉండి, ఎర్రని మఖ్మల్ బట్టతో చేసిన బొమ్మలాంటి పురుగులా ఉంటుంది. ముట్టుకుంటేనే – అత్తిపత్తి చెట్టు ఆకుల్లా ముడుచుకు పోయే స్వభావం ఉన్న ఈ పురుగులు నేలమీద, కొన్నిచోట్ల ఇసుక నేలల్లో, పచ్చగడ్డి కాసింత ఉన్న చోట్లలో, విరివిగా కనిపిస్తాయి. ఈ అందమైన, మెత్తనైన పురుగులు వర్షాకాలం తొలకరి వర్షాలు కురవగానే, బిల బిల మంటూ కుప్పలు కుప్పలుగా కనిపిస్తాయి. బీడువారిన నేలపై తొలకరి జల్లులు పడగానే, బిలబిలమంటూ ఆరుద్ర పురుగులు నేలపైకి వస్తాయి. అలా ఆరుద్ర పురుగులు నేలపై కనిపిస్తే ఆ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తాయనీ,



రైతన్నలు వ్యవసాయం చేసుకోవచ్చని అంటారు. ఆరుద్ర పురుగులకు రైతులకు అవినాభావ సంబంధం ఉంది. వీటిని ఏ రైతు చంపడు, ఎవ్వరినీ చంపనీయడు... వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు ఆరుద్ర కార్తె అనుకూలమైంది. ఈ కార్తెలో మాత్రమే కనబడే అరుదైన పురుగు ఆరుద్ర. అందుకే దాన్ని "ఆరుద్ర పురుగు " అంటారు. ఇవి ప్రకృతి నేస్తాలు. చూడ ముచ్చటగా ఉండే ఆరుద్ర పురుగు ఆగమనాన్ని రైతులు "శుభసూచకం"గా భావిస్తారు. ఇక వ్యవసాయం పనులు మొదటు పెట్టుకోవచ్చని ఆనందంగా పొలాలకేసి మళుతారు. గ్రామాల్లో ఈ పురుగులు కనిపించాయంటే రైతులు సంతోషంతో గంతులేస్తారు. ఆరుద్ర పురుగుల దర్శనంతో, ఆ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడుతాయని సంకేతం. చెరువులు, కుంటలు,ప్రాజెక్టులు నిండుతాయనే ధీమా రైతుల్లో నెలకొంటుంది. ఇసుక నేలల్లో, బొరియలు చేసుకుంటూ, అందులోనే జీవిస్తూ, తొలకరి వర్షాలకి బయటకి వస్తాయి. ఇవి నేలలోని సూక్ష్మ క్రిముల్ని పట్టి తింటూ, రైతులకి మేలు చేస్తాయి. ఇవి అలా బయటకి వచ్చినప్పుడు వర్షానికి. తడిసిన నల్లని భూమి మీద, ఆకుపచ్చని గీతల్లాంటి గడ్డి మీద ఎర్రని చుక్కలు అద్దినట్లుగా కనిపిస్తాయి. ఆ దృశ్యం ఎంతో హృద్యముగా ఉంటుంది. ఇవి మృదువుగా వుండి ముట్టుకుంటే వెల్వెట్ వస్త్రంలా మెత్తగా అనిపిస్తాయి. చూడగానే పట్టుకోవాలని అనిపించెంతగా, ముద్దుగా అందంగా కదిలే బొమ్మల్లా ఉంటాయి. పురుగులంటే భయపడే చిన్న పిల్లలు సైతం ఈ ఆరుద్ర పురుగుల్ని పట్టుకుంటారు. ముట్టుకుంటే చాలు అవి ముడుచు కుంటాయి. కొంత సేపటికి, ఏ కదలికా లేకుండా ఉంటే మెల్లగా నడవడం మొదలు పెడతాయి.



అయితే ఆరుద్ర పురుగులు నెమ్మదిగా అంతరించే దశకు చేరుకుంటున్నాయి. పొలాల్లో మితిమీరిన క్రిమిసంహారక మందులు వాడకం దీనికి ముఖ్య కారణం. ఈమధ్య కాలంలో మరో ప్రమాదకరమైన ధోరణి ఛత్తీస్ గడ్ మరియు తెలుగు రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్నది. ఈ పురుగుల్ని కిలోల లెక్కన కొనే ఏజెంట్లు బయలు దేరారు. వీటి నుంచి సేకరించే నూనెను పక్షవాతం రోగులకు వాడే తైలం లోనూ, లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఆయుర్వేద మందుల తయారీలోనూ వాడుతున్నారని చెపుతారు. అరబ్ దేశాలలో కూడా ఈ పురుగుల్ని వాడుతారు.మనిషి వెదజల్లుతున్న కాలుష్యం, పురుగుల మందుల వల్ల – ఊరపిచ్చుకల, మరికొన్ని జీవాల వలే, ఇవి కూడా కనిపించకుండా పోయే

## భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే కి వినతి.



**భద్రాచలం: జూన్ 21 ( ప్రభ):**
పట్టణ నడిబొడ్డులో ఉన్నటువంటి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం గత 40 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రస్తుతం అంబేద్కర్ గారి విగ్రహం శిథిలావస్థలో ఉండి,ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితిలో ఉన్నదని ఎమ్మెల్యే కి వివరించడం జరిగింది.అదేవిధంగా అంబేద్కర్ గారి నూతన విగ్రహం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి ప్రభుత్వ నిధులతోనే అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కి విన్నవించడం జరిగింది.అదేవిధంగా పట్టణంలో ఉన్న బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు అంబేద్కర్ అభిమానులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి అంబేద్కర్ గారి నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. ఎమ్మెల్యే స్పందిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని గౌరవిస్తూ ప్రభుత్వ నిధులతోనే అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్, బైండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సీనియర్ అడ్వకేట్ పడిసిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వద్ద యోగాంధ్ర కార్యక్రమాలు..



**ఎటపాక: జూన్ 21 ( ప్రభ):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పట్టిన యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని బోట్ల కుంట గ్రామం లో ఫీల్డ్ అసిస్టెంట్ కోర్స వీర భద్రం ఆద్వర్యం లో ఉపాధి హామీ పనులు వద్ద యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ…చక్కని ఆరోగ్యానికి యోగా చక్కని చిట్కా అని ప్రతి రోజు ప్రతి ఒక్కరు కనీసం 40 నిమిషాలు పాటు యోగా చేస్తే అంతకు మించిన ఆరోగ్యం ఇంకొకటి ఉండదు అని అన్నారు. ప్రతి ఒక్కరు యోగాన్ని చేయడం అలవర్చుకోవాలి అని అన్నారు.యోగా ఆరోగ్యానికి మంచి ఔషదం అని అన్నారు.అలాగే మానసిక ఒత్తిడిని తగ్గిస్తూ ప్రశాంతతను కలిగిస్తుంది అని అన్నారు .ప్రతి ఒక్కరు తప్పకుండా యోగాన్ని అలవాటు గా మార్చుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమం లో మెట్ల ధన మల్లికార్జునరావు,sk ఆశ, అపర్ణ, జ్యోతి ,రమేష్,శ్రీను వెంకటేష్,చింత నరసింహారావు, కిట్టు, శ్రీకృష్ణ, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

## గాజుల రామారంలో గోకుల్ చాయ్ పాయింట్ ఘనంగా ప్రారంభోత్సవం






**కుత్బుల్లాపూర్ జూన్21,ప్రభ:**
గాజులరామారంలో నూతనంగా గోకుల్ చాయ్ పాయింట్ ప్రారంభోత్సవం జరిగింది, ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎక్స్ కార్పొరేటర్ పాలకృష్ణ, 125 డివిజన్ కార్పొరేటర్ శేషగిరిరావు, టిఆర్ఎస్ లీడర్ కస్తూరి బాలరాజు, టిఆర్ఎస్ లీడర్ శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ స్టేట్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అంజలి యాదవ్, కుత్బుల్లాపూర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర యాదవ్ సంగం వైస్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, కుత్బుల్లాపూర్ కాంటెస్ట్ ఎమ్మెల్యే కాండేట్ ముత్యపాగ శివకుమార్, 125 డివిజన్ యూత్ ప్రెసిడెంట్ తెలంగాణ సాయి, జర్నలిస్ట్ ఎల్లంపల్లి నర్సింలు, వాసాల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి వరంగల్ ఆలయంలో బోనాల ఉత్సవం... భక్తి, సంప్రదాయం, సమకాలీన భిన్న స్వరాల సమ్మిళితం

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9449595494





వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం గతంలో తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. అయితే ఇటీవల భద్రకాళి అమ్మవారి బోనాలకి సంబంధించి కొంత మంది నుంచి అభ్యంతరాలు రావడంతో పాటు.. పలు సోషల్ మీడియా మాధ్యమాల్లో ఈ విషయంపై తప్పుడు వార్తలు ప్రచురితమైన దృష్ట్యా, ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాలను.. పవిత్రమైన అమ్మవారికి ముడి పెట్టి కొందరు ఉద్దేశ పూర్వకంగానే ఇబ్బందులు సృష్టిస్తారమోనని భావించి.. ఈ కార్యక్రమంలోకి అసాంఘిక శక్తులను ప్రేరేపించి గొడవలు సృష్టిస్తారనే అనుమానంతో బోనాల నిర్వహణ రద్దు చేస్తున్నట్లు వివరించారు.తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ఉన్న ప్రాధాన్యత ప్రత్యేకమైనది. ఇది కేవలం శక్తిమాతకు అంకితమైన పండుగ మాత్రమే కాకుండా, ప్రజల విశ్వాసం, భక్తి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. అయితే ఈ సారి హైదరాబాద్ బోనాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరంగల్ భద్రకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించేందుకు రెడీ అయింది అమ్మవారికి బంగారు బోనం సమర్పించడం.. ఓరుగల్లు ఆలయ చరిత్రలోనే ఇదే తొలిసారి.అయితే 2025లో జరిగిన బోనాల సందర్భంగా కొన్ని సంఘటనలు వివాదాస్పదంగా మారడం, సామాజిక వేదికలపై భిన్న అభిప్రాయాలను రేకెత్తించడం గమనించ దగినది. సంప్రదాయ ఆచరణలు, ఆధునిక స్పందనలు, రాజకీయ ప్రమేయం ఇవన్నీ కలసి భక్తి వేదికపై ఒక కొత్త తరహా చర్చకు దారి తీశాయి.బోనాల పండుగకు సంబంధించి పురాతన ఆచారాలు ఎంతో విశిష్టత కలవైనవి. శక్తి ఆరాధన పద్ధతిలో భాగంగా, గ్రామీణ ప్రజలు తల్లి దేవతను స్తుతిస్తూ ప్రత్యేకమైన నృత్యాలు చేస్తారు. వేషధారణలతో వచ్చే మహిళలు దేవాలయ ప్రాంగణంలో శక్తి నృత్యాలు చేస్తారు. బోనం అంటే అమ్మవారికి సమర్పించే ప్రసాదపాత్ర. దీన్ని ఆడవారు తమ తలపై మోసుకుంటూ ఆలయానికి రాకపోతూ, కుటుంబ సంక్షేమం కోసం ప్రార్థనలు చేస్తారు. ఈ విధానం నేటికీ కొనసాగుతున్న ఆస్తిక సంప్రదాయానికి ఒక జీవ శిల్పం.ఇదే తరుణంలో కొన్ని ఆధునిక కోణాలనూ పండుగ కలగ జేసుకోవడం వల్ల సంప్రదాయాన్ని విస్మరించామా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొంతమంది హిందూ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. సంప్రదాయం పేరుతో ఏమి చేయాలి? ఏమి వదలాలి? అనే ప్రశ్నలు ఈ సంఘటనలతో తిరిగి ముందుకు వచ్చాయి.మత స్థలాలను రాజకీయ ప్రచారానికి వాడుకోవడం ద్వారా, దేవాలయాల పవిత్రతను మసక బారుస్తున్నామని సనాతన వాదులు ఆరోపిస్తున్నారు. ఇక ప్రభుత్వ అధికారుల పాత్ర, ఆలయ కమిటీపై ఒత్తిళ్లు, నిధుల వినియోగానికి సంబంధించి స్పష్టతలేమి వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తిని కలిగించాయి.ఇది కొత్త విషయం కాదు. గతంలో 2017, 2022 బోనాల సమయంలోనూ ఇలాంటి వివాదాలు తలెత్తాయి. విగ్రహాల అలంకరణ, పౌరాణిక భక్తి రసాన్ని కించపరిచే సంగీత ప్రదర్శనలు వంటి అంశాలు అప్పటికీ హిందూ సంఘాల నుండి తీవ్ర ప్రతిస్పందనలకు దారితీశాయి. అంటే, పండుగ నిర్వహణలో ప్రతి చిన్న అంశం మీద భక్తులకు, ప్రజలకు విశేషమైన భావోద్వేగం ఉంటుంది.బోనాలు పండుగగా మారిన తీరు ప్రజాస్వామ్య పరంగా, మానవ సంబంధాల పరంగా ఎంతో విశేషమైనది. ఇది ప్రజల ఆంతరంగిక విశ్వాసానికి ప్రతిఫలంగా నిర్వహించే ఒక ఉత్సవం. అయితే, ఈ పండుగను నిర్వహించడంలో ఉండే రాజకీయ జోక్యం, ఆధునికత పేరుతో సంప్రదాయాల్ని విస్మరించే ప్రయత్నాలు అనేకమంది ఆస్తికులలో ఆందోళన కలిగిస్తున్నాయి. బోనాలకు ప్రభుత్వ సహకారం అవసరమే అయినా, దాన్ని ఒక ప్రచార వేదికగా మలచడం వల్ల పండుగ యొక్క అసలైన ఉద్దేశం వికృత మవుతుంది.ఈ పండుగ సమయంలో మరో ప్రధాన అంశం ၁ ఆలయ నిర్వహణ. లక్షలాది భక్తులు చేరినప్పుడు భద్రత, పారిశుద్ధ్యం, క్యూలైన్లు, పెద్దలకి, చిన్నారులకి ప్రత్యేక ఏర్పాట్లు వంటి అవసరాలు మరింత ప్రాధాన్యత పొందుతాయి. ఆలయ పరిసరాల్లో వ్యాపారుల ధరల పెంపు, శాశ్వత వసతుల కొరత వంటి సమస్యలు కూడా ప్రతిసారి పునరావృత మవుతున్నాయి.ఇలాంటి సమకాలీన సంఘటనల మధ్య, ఒక సత్యం స్పష్టంగా తెలుస్తోంది. బోనాలు కేవలం ఒక పండుగ కాదని, అది ప్రజల జీవన విధానానికి, సామాజిక స్పృహకు, మత విశ్వాసాలకు అద్దం పడుతున్న వేదికగా మారిందని. అందుకే, ఈ ఉత్సవాన్ని నిర్వివాదంగా, హుందాగా నిర్వహించడం ఆలయ కమిటీ, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు భక్తుల సామూహిక బాధ్యత.భద్రకాళి ఆలయం వద్ద జరిగే బోనాల వేడుకలు భక్తి పరమోత్కర్షాన్ని, సమాజంలోని ఆంతరంగిక స్పందనల్ని ప్రతిబింబిస్తూ ఉండాలి. సంప్రదాయం అనేది మారుతున్న కాలానుగుణంగా కొనసాగాలి గానీ, మౌలిక విలువలను తుడిచి పెట్టేలా కాకూడదు. భక్తి పునాది మీద నిలిచిన ఈ పండుగ, రాజకీయ జోక్యం కింద మసక బారకుండా ఉండాలంటే, సంప్రదాయపు శక్తిని ఆధునికతతో సమన్వయపరిచే దిశగా మన ప్రయత్నం సాగాలి.ఈ సందర్భంగా, సమస్త వర్గాల ప్రజలు కలిసి పనిచేస్తే, భద్రకాళి ఆలయంలో బోనాల పండుగ భక్తి, సాంస్కృతిక పునరుద్ధరణకు చిహ్నంగా నిలవగలదు. అందులో సంప్రదాయాల విలువ, భక్తుల గౌరవం, సమకాలీన అవసరాల నెరవేరు అనుసంధానం ఉంటే, అప్పుడు మాత్రమే ఈ పండుగకు పూర్తిస్థాయి చైతన్యం లభిస్తుంది. పంచభూతాలను ప్రతినిధించేది దేవతల రూపంబీ ఆ రూపాన్ని భక్తితో పూజించడమే నిజమైన బోనం.

## బాలానగర్ పోలీస్ స్టేషన్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు..




పాల్గొన్న పోలీస్ అధికారులు..








**కూకట్ పల్లి జూన్ 21,ప్రభ:**
పదకొండో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరదిలో సాముహిక యోగా కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 82-ఏళ్ల యోగ గురువు బాబురావు హాజరై, పోలీస్ అధికారులచే యోగ ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లడుతూ ప్రతీ ఒక్కరూ నిత్య జీవితంలో యోగాకు రోజుకు ఒక్క గంట సమయం కేటాయిస్తే ఏలాంటి జబ్బులు దరిచేరవని యోగా ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని యోగా ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ఈ యోగా ద్వారా భారత దేశానికి అంతర్జాతీయ గుర్తింపు లభించదని అన్నారు.నేటి జీవితంలో పోలీస్ వ్యవస్థలో పని చేయుచున్న ఉద్యోగులు ఒత్తిడ్డికి లోనవకుండా ఉండటానికి యోగా ఆరోగ్య ప్రధాయినిగా నిలుస్తున్నదని, దీనిని అందరూ ఆరోగ్యవంతమైన జీవన విధానానికి యోగా శిక్షణ ఆచరించి మంచి ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. ఇందులో ఎస్ఐ సరితా రెడ్డి, హాజీ మియా, నర్సిములు, పిఎస్ఐలు వెంకటేశం, వినోద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## శారీరక మానసిక దృఢత్వానికి యోగ తప్పనిసరి.


-సీఐ రేణుక రెడ్డి.



**జూన్ 21,ప్రభ:**
శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పెద్ద శంకరంపేట కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ రేణుక రెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి యోగాసనాలు వేశారు. యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందని, క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఏకాగ్రత పెరిగి ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట ఎస్సై ప్రవీణ్ రెడ్డి.ఎస్సై శంకర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

# త్రి భాషల్లో తొలి టాకీ చిత్రాల్లో నటించిన ఎల్.వి.ప్రసాద్

**జూన్ 22... ఎల్.వి. ప్రసాద్ వర్ధంతి**
**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**



భారతీయ సినిమాకు నడకలు నేర్పిన సినీ పరిశ్రమ ప్రజ్ఞాశాలి, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకుడు ఆయన. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, నటుడుగా సినీ నిఘంటువులో తనకంటూ కొన్ని పేజీలు సృష్టించుకున్న ఉద్దండుడు. మొట్ట మొదటి హిందీ టాకీ చిత్రం 'ఆలం అరా'తో పాటు తమిళ 'కాళిదాస్',తెలుగులో 'భక్త ప్రహ్లాద' వంటి మూడు భాషల్లో తెరకెక్కిన తొలి టాకీ సినిమాల్లో నటించిన ఘనత ఆయనకే సొంతం. దర్శకుడిగా 1949లో వచ్చిన 'మన దేశం' సినిమాతో ఎన్టీఆర్‌ను, ఆయనతో పాటు షావుకారు జానకి, సావిత్రి లాంటి గొప్ప నటులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనత వహించిన గొప్ప వ్యక్తి ఆయన. ఇంతకీ ఆయన ఎవరో తెలుసా! భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించి నందుకు గాను దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న ఎల్.వి.ప్రసాద్. ఎల్.వి.ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు తెలుగు సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు. ఎల్.వి. ప్రసాద్ చలన చిత్రరంగానికి ఎనలేని సేవ చేశారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలం ఆరా, కాళిదాస్, భక్త ప్రహ్లాద మూడింటిలోనూ ఆయన నటించారు. తెలుగు వారిలో ఆయన ఒక్కరే ఈ ఘనత సాధించారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకత్వం వహించటం గానీ, నిర్మించటం గానీ, నటించటం గానీ చేసారు. ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం, ద్రోహి,సంసారం, మిస్సమ్మ, అప్పు చేసి పప్పు కూడు తదితర ఆణి ముత్యాల లాంటి సినిమాలు అందించారు.ఆయన జనవరి 17,1908 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు తాలూకా లోని సోమవరప్పాడు గ్రామంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మ దంపతుల రెండవ సంతానముగా జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టిన ప్రసాద్ గారాబంగా పెరిగారు. చురుకైన వారే అయినా చదువులో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఉరూరా తిరిగే నాటకాల కంపెనీలు, డాన్సు ట్రూపుల డప్పుల చప్పుల్లు ప్రసాద్ ను ఆకర్షించేవి. పాత అరిగి పోయిన సినిమా రీళ్ళను ప్రదర్శించే గుడారపు ప్రదర్శన శాలల్లో ప్రసాద్ తరచూ వాటిని ఆసక్తిగా చూసేవారు. స్థానిక నాటకాల్లో తరచుగా చిన్న చిన్న వేషాలు వేసేవారు. అదే ఆసక్తి పెద్దయ్యాక కదిలే బొమ్మలు, నటనపై ఆసక్తిని పెంచి సినిమా రంగంలో ప్రవేశించ డానికి పునాదులు వేసింది.1908 జనవరి 17న జన్మించిన ఎల్.వి.ప్రసాద్ వివాహం సౌందర్య మనోహరమ్మతో జరిగింది. ఒకరోజు ఆయన సినిమాల్లో నటించాలనే కోరికతో జేబులో 100రూ.లతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ముంబయికి వెళ్లిన ఆయనకు ఎంతో కష్టపడగా చివరికి "ఆలం అరా" చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రందేశం లోనే తొలి టాకీ సినిమా. అందులో ఎల్.వి.ప్రసాద్ ఓ పాత్ర చేశారు. ఈ చిత్రంలో నటించి నందుకు గాను ఎల్.వి.ప్రసాద్‌కు నెలకు 30 రూపాయలను అంద జేశారు. ముంబై వీనస్ ఫిల్మ్ కంపెనీలో చిన్నచిన్న పనులు చేసే సహాయకుడుగా జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, శబ్ద చిత్రం "స్టార్ ఆఫ్ ది ఈస్ట్"లో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత హెచ్.ఎం.రెడ్డి దర్శకత్వంలో రూపు దిద్దుకున్న తమిళ చిత్రం కాళిదాస, తెలుగు చిత్రం భక్త ప్రహ్లాదలో ఆయన నటించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగిన ఎల్.వి.ప్రసాద్ 1950లో విడుదలైన విజయ పిక్చర్స్ వారి "షావుకారు" సినిమాకు "దర్శకత్వం" వహించి పేరు తెచ్చుకున్నారు. ఎన్టీ రామారావు, జానకి నటిచిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రసాద్ ప్రొడక్షన్‌ను నెలకొల్పిన ఎల్.వి.ప్రసాద్ హిందీలో మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్ దూజే కె లియే వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి ఎంతో పాపులారిటీ సంపాదించారు.1931లో ఆలం ఆరా – మొదటి హిందీ టాకీ సినిమా, 1931లో కాళిదాస్ – మొదటి తమిళ టాకీ సినిమా, 1931లో భక్తప్రహ్లాద – మొదటి తెలుగు టాకీ సినిమా, 1933 లో సీతా స్వయంవర్ (హిందీ), 1940లో బోండాం పెళ్ళి (తెలుగు), 1940లో చదువుకున్న భార్య, 1982లో రాజా పార్వాయి (తమిళం), చిత్రాలలో ఆయన నటించారు.మిస్సమ్మ (1955), గృహ ప్రవేశం (1947), పల్నాటి యుద్ధం (1947),ద్రోహి (1948), మన దేశం (1949), సంసారం (1950), షావుకారు (1950) చిత్రాలకు దర్శకత్వం వహించారు.జూన్ 22 1994లో ఈ లోకాన్ని వీడి వెళ్లినా, తన చిత్రాలతో ప్రేక్షకుల మదిలో కొలువై ఉన్నారు.ఎల్వీ ప్రసాద్ స్మారకార్థం భారత తపాలా శాఖ 2006 సెప్టెంబరు 5న ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది.ఎల్. వి. ప్రసాద్ హైదరాబాద్ లో నేత్ర వైద్యశాల స్థాపన కొరకు కోటి రూపాయల ధనం, బంజారా హిల్స్ లో ఐదు ఎకరాల స్థలం దానం చేశారు. ఆయన చేసిన త్యాగానికి గుర్తుగా ఆయన పేరును ఆ సంస్థ పేరు ముందు ఉంచారు.తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ఎంతో మంది ప్రజలు ఇక్కడకు వచ్చి చికిత్స చేయించు కుంటారు. 34 ఏళ్ల క్రితం 1987లో చిన్న సంస్థగా మొదలై హైదరాబాదులో స్థాపించబడిన లాభాపేక్ష లేని, ప్రభుత్వేతర నేత్ర వైద్యశాల. సమాజంలోని అన్ని వర్గాలకు సమానమైన, సమర్థవంతమైన కంటి సంరక్షణ సంస్థ లక్ష్యం కాగా...అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకుంది ఈ కంటి ఆసుపత్రి.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చొరవతో 4వ డివిజన్లో రోడ్డు ప్రారంభం





**కుత్బుల్లాపూర్ జూన్ 22,ప్రభ:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ 4వ డివిజన్ మంజీరా వాటర్ ట్యాంక్ రోడ్ పరిధిలో సీసీ రోడ్ పూర్తిగా పాడువటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని గత నెల సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి మున్సిపల్ స్పెషల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి 20,00,000 రూ మంజూరు చేయించి రోడ్డు ను నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, , ఎన్ ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మద్ది నారాయణరెడ్డి, సురేంద్ర కుమార్ యాదవ్, సుబ్బు, యుగేంధర్ రెడ్డి, వెంకట్ రావు యాదవ్, శివ కుమార్, మహమూద్, నారాయణ రెడ్డి, చంద్ర, చంద్ర శేఖర్, రమేష్, రామారావు , ఆది, రాజేష్, జగదీష్, నెహ్రూ, పవన్, శ్రీనివాస్, మధు, గోపాల్, రాఘవేంద్ర, గవాస్కర్, మోహన్, రమారవు, శివ మహేష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, విజయ్ కుమార్, సందీప్ రెడ్డి, గూడూరు మురళీకృష్ణ, దాసరి మహేష్, జెగ్గా మధుసూదన్ రెడ్డి, సయ్యద్ రఫత్,చిరంజీవి, వీరబాబు గౌడ్, రవీందర్ రెడ్డి, వాసు వరగాని, బికాంక్ష, రమేష్, బలవంత రెడ్డి, (లడ్డు), మల్లికార్జున్, రామచంద్రనాయక్, తులసి దాస్ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## శక్తి స్వరూపిణి విజయదుర్గ అమ్మవారు

**-బిఆర్ఎస్ పార్టీవిప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**





**కుత్బుల్లాపూర్ జూన్ 22,ప్రభ:** సుభాష్ నగర్ 130 డివిజన్ సూరారం మార్కెట్ రోడ్ లోని శ్రీ విజయ దుర్గా సమేత బంగారు మైసమ్మ దేవాలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... శక్తి స్వరూపిణి అయిన విజయదుర్గ అమ్మవారిని కొలవడం ద్వారా చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరుతుందని అన్నారు. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు హేమలత సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా ఆఫీసర్ ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, దేవాలయ చైర్మన్ వెంకటస్వామి మరియు ఆలయ కమిటీ సభ్యులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్, పందిరి యాదగిరి, గుబ్బాల లక్ష్మీనారాయణ, తారా సింగ్, కావలి రవి, వేణు ముదిరాజ్, గట్టు అశోక్, చెక్క సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ నిధులు విడుదల చేయాలి

**-ఎస్ఎఫ్ఐ గిరిజన సంఘం కెవిపిఎస్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల అభివృది జిల్లా అధికారి నరసింహ స్వామి కి వినతిపత్రం అందజేత**

**-తక్షణమే పెండింగ్ నిధులు విడుదల చేయకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం**



**మహబూబాబాద్ జూన్ 22,ప్రభ:** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పెండింగ్లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి దుడ్డల రామ్మూర్తి ,తెలంగాణ గిరిజన సంఘం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్, పట్ల మధు డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా అదనపు షెడ్యూల్ కులాల అభివృద్ధి జిల్లా అధికారి నరసింహస్వామి కి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు సంవత్సరాలుగా బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు పెండింగ్లో ఉండడం వల్ల ఎస్సీ ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చాలా ప్రైవేట్ పాఠశాలల్లో నిధులు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పెండింగ్ నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు లేనియెడల రాబోయే రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చీపిరి యాకన్న ,తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బానోత్ వెంకన్న ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతి బస్సు కెవిపిఎస్ జిల్లా నాయకులు మందుల మహేందర్, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కిషన్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గుండ్ల రాకేష్ దిలీప్ మహేష్ వినయ్ ప్రమోద్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదువుకోవాలి జీవితంలో పైకి ఎదగాలి




**కూకట్ పల్లి 21,ప్రభ :** తెలంగాణ ప్రగతి సేవా సంస్థ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దివంగత కాంగ్రెస్ నాయకుడు పాండు ముదిరాజ్ పదవ వర్ధంతి సందర్భంగా ఫతేనగర్ హాలో నీ భగత్ సింగ్ పార్కులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కష్టపడి చదువుకోవాలని జీవితంలో పైకి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, సూరజ్ తివారి, కే రాజు, కే రమేష్, నార్సింగ్ రావు, కిట్టు, మధు, ప్రకాష్ ముదిరాజ్, అస్లాం, శివ చౌదరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి తిమింగలాన్ని సెలవులపై ఇంటికి పంపించారు

**నారాయణఖేడ్,జూన్ 21 ప్రభ:** లంచాలకు మరిగిన నారాయణఖేడ్ సహాయ కార్మిక అధికారి గిరిరాజును గడిచిన బుధవారం స్థానిక కార్యాలయంలో బాధితులు నిలదీసిన వార్త సామాజిక మాద్యమాలు,వార్త పత్రికలలో చూసిన కమిషనర్ శనివారం నుండి గిరిరాజును సెలవుపై ఇంటిముఖం పట్టించారు.గిరిరాజు బాధ్యతలు చేపట్టి కొద్దికాలమే అవుతున్న కార్యాలయాన్ని లంచాలకు మారుపేరుగా తయారు చేశారు.నేను మీకు సేవా చేయడానికే ఉన్నానని, ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన అధికారి సక్రమంగా పనిచేయలేదని, మీకు త్వరితగతినా సేవలు అందించడానికి కంప్యూటర్ ఏర్పాటు చేశానని,సొంత డబ్బులు జీతంగా ఇస్తూ ఆపరేటర్ ని కూడ ఏర్పాటు చేశానని చెబుతూనే ఆఫీస్ ఖర్చులు



ఉంటాయి,ఆపరేటర్ జీతం ఇవ్వాలంటూ ప్రతీ పథకానికి రేట్ ఇంతని డబ్బులు వసూలు చేసేవాడు. ఎవరైనా ఎదురుతిరిగితే నేను మాజీ ఎమ్మెల్యే బావమరిదిని అంటూ భయభ్రాంతులకు గురిచేసేవాడు. ఈ భూమిపై తప్పుడు పనులు ఎక్కువరోజులు నిలవవు అన్నట్లు తక్కువ సమయంలోనె అతని లంచాల గుట్టురట్టయ్యింది. అతనివల్ల ఇబ్బందులు పడ్డవాళ్లు, పథకాలు దక్కకుండా పోయినవాళ్లు బుధవారం నాడు అతని నిగ్గుతేల్చారు. జిల్లా, రాష్ట్ర అధికారుల ద్రుష్టి కి అతడుచేసిన ఘనకార్యం తెలియడంతో శనివారం అతనికి సుదీర్ఘ సెలవులపై ఇంటికి పంపించారు.

## షాపూర్ నగర్ లో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**







**కుత్బుల్లాపూర్ జూన్ 22,ప్రభ:** సూరారం 129 డివిజన్ షాపూర్ నగర్ ప్రధాన రహదారిలోని ఎంజాయ్ గార్డెన్స్ నందు శివశక్తి యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... యోగాసనాల ద్వారా శారీరక ఉల్లాసం తో పాటు మనసు, ఆలోచన విధానం దృఢంగా మారుతాయని, ప్రతి ఒక్కరూ దైనందిక జీవనంలో యోగాను అలవర్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో శివశక్తి యోగా కేంద్రం ఆచార్యులు మల్లేష్, పూర్ణ, విజయ్, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, హేమలత సురేష్ రెడ్డి, మహమ్మద్ రషీదా రఫీ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ రికార్డ్ సాధించిన యోగాంధ్ర లో పాల్గొన్న ఎటపాక ఎస్టీ సెల్ ఐటీడీపీ అధ్యక్షులు...





**ఎటపాక : జూన్ 21 ( ప్రభ):** ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర-2025 రికార్డు సృష్టించింది. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ వేదికగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ రికార్డు సాధించింది. 3.01 లక్షల మంది ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎటపాక ఐటీడీపీ ఇంచార్జ్ బాచినేని శ్రీకాంత్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కనితి మధుబాబు పాల్గొన్నారు .గతంలో సూరత్లో నిర్వహించిన యోగా రికార్డును (1.47 లక్షల మంది) ఇది అధిగమించింది. విశాఖ నగరంలోని రామకృష్ణ బీచ్ నుంచి భీమిలి వరకు లక్షల మంది ఒకే మార్గంలో యోగాసనాలు వేసి రికార్డు సృష్టించారు.

## సున్నం చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం





**కూకట్ పల్లి జూన్ 22,ప్రభ:** కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, అన్ని విభాగాల అధికారులతో సున్నం చెరువు అభివృద్ధిపై ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం వస్తున్న దృష్ట్యా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అలాగే అత్యంత సుందరీకరణగా తీర్చిదిద్ది చుట్టూ మొక్కలు కూడా నాటాలని సూచించారు. జిహెచ్ఎంసి వాటర్ వర్క్స్, హైడ్రాధికారులు సమన్వయం చేసుకునే పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గంలోని చెరువులను అభివృద్ధి చేయడానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం నుంచే ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. ఇందులో భాగంగానే ప్రతి చెరువులో కూడా మంచినీరు ఉండేటట్లు ఎక్కడకక్కడ ఎస్టిపి ప్లాంట్లు కూడా నిర్మిస్తున్నామని అవి కూడా పూర్తయితే శుద్ధి చేసిన నీరే ప్రవహిస్తుందని.. దీంతో దోమల బెడద కూడా తగ్గుతుందని వివరించారు. ప్రజలు కూడా చైతన్యవంతులై పరిశుభ్రత పాటించాలని ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేటట్లు చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు ,జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

# యోగ మన నిత్యజీవితంలో భాగం కావాలి.






**-ఏబీవీపీ క్షేత్రీయ సంఘటనా కార్యదర్శి శివకుమార్ జీ**

**-దుండిగల్ లో ఘనంగా యోగ దినోత్సవం.**

**కుత్బుల్లాపూర్ జూన్ 22,ప్రభ:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మేడ్చల్ జిల్లా దుండిగల్ నగర శాఖ అధ్వర్యంలో బౌరంపేట లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల లో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం జరగింది.ఈ కార్యక్రమంలో క్షేత్రీయ సంఘటనా మంత్రి శివకుమార్ జీ మాట్లాడతూ ప్రస్తుత సమాజంలో ఉన్నటువంటి విద్యార్థులు చదువులకు బానిసలు అవుతూ ఒత్తిడికి గురవుతున్నారు విద్యార్థులకు ఎంత బలంగా ఉన్న మానసికంగా మాత్రం చాలా బలహీనులుగా ఉంటున్నారు .రోజువారి సమయంలో కాస్త సమయాన్ని శారీరక ఆసనాలు మరియు ధ్యానం వంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి,అప్పుడే ఆ ఒత్తిడికి గురైన విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా కొంతవరకు అయినా ప్రాణాపాయస్థితి నుంచి కాపాడగలం. అదేవిధంగా మనిషి బతకడానికి తిండి ఎంత అవసరమో మన మెదడు పని చేయడానికి మనం రోజు ఉత్సాహంగా ఉండడానికి శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండడం చాలా అవసరం అని అన్నారు.అదేవిధంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎస్ ఎఫ్ డి (స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్) పేరుతో పర్యావరణ పరిరక్షించడం (ఎస్ ఎఫ్ ఎస్ స్టూడెంట్ ఫర్ సేవ) విద్యార్థులకు సమాజంలో చేసేటువంటి సేవా కార్యక్రమాల గురించి అవగాహన కల్పించడం మరియు కళామంచ్ పేరుతో విద్యార్థులలో ఉన్నటువంటి వాళ్ళ యొక్క నైపుణ్యాలను బయటికి తీసుకురావడం వంటి కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తుంది. వీటన్నిటిలో కూడా విద్యార్థులు ముఖ్యమైన పాత్ర పోషించి విద్యార్థుల యొక్క ప్రతిభను సమాజానికి తెలియజేయాలి మనమందరం కూడ దేశ నిర్మాణంలో భాగం అవ్వాలి అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి విభాగ్ కన్వీనర్ శ్రీనాథ్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ రేగోడ్ నాగేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేంద్ర, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కళ్లు తెరిచి చూస్తే వాస్తవాలు కనిపిస్తాయి








**-రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందో.. పెరిగిందో అప్పుడు తెలుస్తుంది**

**-మీరు దుష్ప్రచారం చేసినా... గణాంకాలు అబద్ధం చెప్పవూ**

**-నిర్మాణ రంగ అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**-టైమ్స్ హెూమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్ పో" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

**శేరిలింగంపల్లి జూన్ 22,ప్రభ:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నిర్వహించిన "టైమ్స్ హెూమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్ పో 2025" కార్యక్రమంలో ఐటీ ,పరిశ్రమ, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ,పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందంటూ కొందరూ కావాలనే పనిగట్టుకొని మా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారు ఒక్కసారి కళ్లు తెరిచి వాస్తవాలు తెలుసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. శనివారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో "టైమ్స్ హెూమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్ పో 2025"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. "2024- 25 ఆర్థిక సంవత్సరంలో రియల్ ఎస్టేట్ & ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో 15.4 శాతం వృద్ధి రేటు నమోదయ్యింది. నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి చెందింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం రూ.80వేల కోట్లు సమకూర్చింది. తెలంగాణ సర్వీసెస్ ఎకానమీలో ఈ రంగం వాటా 24.9 శాతం. ప్రస్తుతం రెరా దగ్గర 9744 రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్స్ రిజిస్టర్ అయ్యాయి. ఇవి గణాంకాలు కాదు... మా హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి చెంప దెబ్బ" అని వివరించారు. "ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్క హైదరాబాద్ లోనే 5900 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.కోటి, అంత కంటే ఎక్కువ ధర గల ఇళ్ల వాటా 18 శాతంగా ఉంది. ఈ తరహా ఇళ్ల కొనుగోలులో వార్షిక వృద్ధి రేటు 58 శాతంగా నమోదు అయ్యిందని నైట్ ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది" అని గుర్తు చేశారు. "రాష్ట్రంలో అర్హులైన వారందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తాం. తొలి దశలో 4.16 లక్షలు ఇచ్చాం. ప్రతి ఒక్కరూ తలెత్తుకొని గౌరవప్రదంగా జీవించాలనే సంకల్పంతోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టాం"అని చెప్పారు. "రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న నిర్మాణ రంగం అభివృద్ధికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. "ఈ వేదిక ద్వారా బిల్డర్లు, కొనుగోలుదారులకు ఒక్కటి స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. ప్రభుత్వం మీ వెంట ఉంది. నిర్మాణ రంగ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా సిద్ధంగా ఉంది. ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు. ధైర్యంగా అడుగు ముందుకు వేయండి"అని కోరారు.ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రెసిడెంట్ జైదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ కు ఘన నివాళులర్పించిన టీఆర్ఎస్ నాయకులు

**-ప్రొఫెసర్ జయశంకర్ చివరి శ్వాస వరకు తెలంగాణే లక్ష్యం.**

**-మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప.**

**-ప్రొఫెసర్ జయశంకర్ జాతిపితగా రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.**

**-మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ కు ఘన నివాళులు.**



**టేక్మాల్, జూన్ 22,ప్రభ:** తొలి, మలి తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ అలుపెరుగని పోరాటం చేశారాని, చివరి శ్వాస వరకు తెలంగాణ లక్ష్యంగా పోరాడారని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప ప్రొఫెసర్ జయశంకర్ సేవలను కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ 14వ వర్ధంతి సందర్భంగా శనివారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప మాట్లాడుతూ... తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర వెలకట్టలేనిదని, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ సారధ్యంలోనే తెలంగాణ సాధ్యమవుతుందని ఆయన గ్రహించారని ఆయన అన్నారు. జయశంకర్ భౌతికంగా లేకపోయినా ఆయన ఆశయ సాధనలను కేసీఆర్ ముందుకు తీసుకెళ్లారని, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి దేశంలోనే అగ్రగామిగా నిలిపించారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్రం సాధించేలా చేశారని ఆయన కొనియాడారు. ఆయన తెలంగాణ జాతిపితగా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్ మాజీ ఎంపీటీసీ కమ్మరి సిద్ధయ్య, నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ విజయ్.చింతా రవి,సుబేదార్ సురేస్. నారాయణ, సాయిలు,శ్రీశైలం, రాజేందర్.దుర్గయ్య మతిన్, వసీం.యాదగిరి,వసంత్ నాయక్,యాదయ్య, రమేష్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో గండిమైసమ్మ చౌరస్తా వేదిక ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు






**దుండిగల్ జూన్ 22,ప్రభ:** మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీగారి ఆశయం ఆరోగ్య భారత నిర్మాణం ప్రతి వ్యక్తి తన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని ఉరుకులు పరుగుల జీవితంలో వత్తిడికి గురై గుండెపోటు, పక్షవాతం ఇతర అనారోగ్యం సమస్యలతో అర్ధాంతరంగ ప్రాణాలు కోల్పోతున్నారు ప్రస్తుతం వాతావరణంలో మార్పులు బయట దొరికే కలుషిత ఆహారానికి దూరంగా ఉంటూ ఎన్ని పనులు ఉన్నా కచ్చితంగా కనీసం ప్రతి రోజు ఒక గంట యోగా వ్యాయమానికి సమయం ఇవ్వాలి అప్పుడే కుటుంబంలో అందరు ఆరోగ్యం గా ఉంటారు తద్వారా దేశం సంపూర్ణ ఆరోగ్య దేశంగా బాసిలు ్లతుందన్నారు.యోగ మనకు మనం ఎవ్వరం ఒకరం చేసుకోలేము కావున గురువు సమక్షంలో చేస్తేనే ఉత్తమ ఫలితం వస్తుంది ప్రతి రోజు దుండిగల్ మున్సిపల్ పరిధిలో బౌరంపేట్, డి పోచంపల్లి, దుండిగల్ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో ఆర్ఎస్ఎస్ సంస్థ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు ఉచిత యోగ శిక్షణ నిర్వహించడం జరుగుతుంది. ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా ప్రభుత్వం నియమించిన బౌరంపేట్, దుండిగల్లో యోగ టీచర్లు కూడా అందుబాటులో ఉన్నారు బయట కుదరని వారికీ వీరు కాకుండా ప్రైవేట్ యోగ టీచర్ లు కూడా ఎంతో మంది అందుబాటులో ఉన్నారు కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనగలరు మీరు మీ కుటుంబం స్వీయ రక్షణ పొందగలరు.ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో పతంజలి యోగ శిక్షక్ బత్తిని కిషన్ గౌడ్ ప్రోటోకాల్ ఆసనాలు వాటి విశిష్టత గురించి తెలియజేశారు బీజేపీ జిల్లా అధ్యక్షులు డా ఎస్ మల్లారెడ్డి బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి గారు జిల్లా ప్రధాన కార్యదర్శి దుండిగల్ విగ్నేష్వర్ ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు శ్యామ్ రావ్ సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్, రామచంద్రరెడ్డి, గోనె మల్లారెడ్డి ప్రభాకర్ రెడ్డి, దమ్మగారి సీతారాం రెడ్డి, భాను గౌడ్,డి ప్రభాకర్ రెడ్డి నర్సింహా చారి,మధు గౌడ్, మధు, ఆకుల విజయ్, శ్రీకాంత్, ఎస్ లత,వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# నిత్యానరకంగా మారిన హాఫీజ్ పేట్

- చందా నగర్ మంజీర పైప్ లైన్ రోడ్డువిస్తరణ అభివృద్ధి చేయాలని కోరుతూ భాజపా ఆధ్వర్యంలో నిరసన పాదయాత్ర కార్యక్రమం







-ఊసరవెల్లి లాగా పార్టీలు మారుతూ ప్రజా సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే అరకపూడి గాంధీ

-స్థానిక కార్పొరేటర్ వెంటనే రాజీనామా చేయాలి: రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్

**శేరిలింగంపల్లి జూన్ 22,ప్రభ:** నిత్యం నరకయాతన పడుతూ వేలాది మంది వాహనదారులు ఉద్యోగాలకు వెళ్లాలన్నా, బయటకు వెళ్లి వ్యాపారం చేసుకోవాలన్న ,చదువుకునే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా రోడ్ల పరిస్థితి బాగు లేక నరకం చూస్తున్నారని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ నాయకత్వంలో ,హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ అనూష మహేష్ యాదవ్ సమక్షంలో, డివిజన్ అధ్యక్షులు జితేందర్ అధ్యక్షతన ఈరోజు హాఫీజ్పేట్ మంజీరా రోడ్డు నుండి చందానగర్ మున్సిపల్ కార్యాలయం వరకు ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ, వేసవికాలం మొత్తం విశ్రాంతి తీసుకుని బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ అధికారుల నిర్లక్ష్యం ,ప్రజా ప్రతినిధులు అలసత్వం వలన ఈరోజు శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను భారతీయ జనతా పార్టీ భుజాలపై వేసుకొని సమస్యల పరిష్కార దిశగా ప్రజా పోరాటం చేస్తున్నామని కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ తెలిపారు.వర్షాకాలం నెత్తిమీదికి వచ్చిన సమయంలో అధికారులు ఇప్పుడు మత్తు నిద్ర వదిలి ఎక్కడ రోడ్డు అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కల్పిస్తూ రాక్షసానందం పొందుతున్నారు, తస్మా జాగ్రత్త ప్రజలను ఇబ్బంది పెడితే వదిలే ప్రసక్తే లేదని అధికారులను, ప్రజా ప్రతినిధులను హెచ్చరిస్తూ ,నిలిచిపోయిన రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ కి రోడ్ల సమస్యలపై వినతి పత్రం రాసి జిహెచ్ఎంసి కార్యాలయానికి వెళ్లి అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిని మహేష్ యాదవ్, అనూష రాఘవేంద్రరావు, రవీందర్రావు, మని భూషణ్, జితేందర్, రమణయ్య, శ్రీనివాస్ ,గణేష్, సత్యనారాయణ రాజు, రామరాజు, కేశవులు, నర్సింగ్ యాదవ్, సింధూ రెడ్డి, పద్మ, వినయ, మాణిక్, లక్ష్మణ్, సురేష్, రవి ,అశోక్, పృధ్వి గౌడ్ మొదలగు వారు పాల్గొన్నారు.

## భూభారతి చట్టం రైతులకు ఒక వరం.

మాజీ జెడ్పీ చైర్పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి.



**మహేశ్వరం, జూన్ 22,ప్రభ:** భూభారతి చట్టం రైతులకు ఒక వరమని మాజీ జడ్పీ చైర్పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి అన్నారు. శనివారం గొల్లూర్ లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు భూమి సమస్యలను రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చునని ఆమె తెలిపారు. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన ధరణిలో ఉన్న లోటుపాట్లను తీసేసి కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. రైతులందరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

## గంజ్ నాలాను క్లిన్ చేస్తూ చరిత్రను తిరగ రాసిన జగిత్యాల మున్సిపల్ సానిటేషన్ సిబ్బంది

మున్సిపల్ కమిషనర్ స్పందన, సానిటరీ ఇన్స్పెక్టర్ గంగిలి మహేశ్వర్ రెడ్డి

-వంద రోజుల ప్రణాళిక లో భాగంగా గంజ్ నాలాను క్లిన్ చేస్తున్న మున్సిపల్ శానీటేషన్ సిబ్బంది

-సంతోషాన్ని వ్యక్తం చేసిన గంజ్ ప్రాంత ప్రజలు





**జగిత్యాల జిల్లా ,జూన్ 22,ప్రభ:** సంపూర్ణ ఆరోగ్య రక్షణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ను ఘనంగా జరుపుకొంటుండగా జగిత్యాల మున్సిపల్ ఆధ్వర్యంలో సంపూర్ణ ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టారు.జగిత్యాల పట్టణ ప్రజలందరికి సుపరిచితమైన గంజ్ నాలా శుభ్రం చేయడం చూడని వారేందరో. ఇలాంటి గంజ్ నాలాను వంద రోజుల ప్రణాళిక లో భాగంగా మున్సిపల్ సానిటేషన్ సిబ్బంది క్లిన్ చేస్తుండడం ఆ ప్రాంత ప్రజలకు ఎంతో సంతోషాన్ని పెంచింది. ఓవైపు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కోరడం మరోవైపు మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన గంజ్ నాలా క్లినింగ్ మరోవైపు సంపూర్ణ ఆరోగ్యాన్ని కోరాడమేనని స్థానికులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందన సానిటరీ ఇన్స్పెక్టర్ గంగిలి మహేశ్వర్ రెడ్డి ,పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు .

# మియాపూర్ డివిజన్ మయూరి నగర్ పార్క్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం

-మనసు, శరీరం, ఆత్మకు సామరస్యం యోగ... మాజీ పార్లమెంటు సభ్యులు గరికపాటి మోహన్ రావు

-ప్రపంచ ఐక్యతకు ప్రతీక యోగబి కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా అందరిని ఏకం చేసేది యోగ...బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే,ఇన్చార్జి రవికుమార్ యాదవ్





**శేరిలింగంపల్లి జూన్ 22,ప్రభ:** మియాపూర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పట్టాభిరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంటు సభ్యులు గరికపాటి మోహన్ రావు,శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి రవికుమార్ యాదవ్ మరియు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులతో కలిసి యోగ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.యోగా అనేది కేవలం వ్యాయామం కాదు,ఇది శరీరం, మనస్సు, ఆత్మలను ఏకం చేసే ఒక ప్రాచీన పద్ధతి,యోగా యొక్క అనేక ప్రయోజనాలను స్మరించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించడానికి ఉద్దేశించిన మంచి రోజు యోగా రోజని గరికపాటి తెలిపారు.ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ యోగా శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది -శరీరాన్ని బలోపేతం చేస్తుంది, సౌలభ్యాన్ని పెంచుతుంది, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. మానసిక ఆరోగ్యానికి కూడా ఇది చాలా అవసరం. ఒత్తిడిని తగ్గిస్తుంది, ఏకాగ్రతను పెంచుతుంది, మానసిక ప్రశాంతతను అందిస్తుంది. ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి యోగా ఒక శక్తివంతమైన సాధనమని తెలియజేస్తూ ,యోగాను కేవలం ఒక రోజుకు పరిమితం చేయకుండా, మన దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మయూరి నగర్ కాలనీవాసులు, రాఘవేంద్రరావు ,బుచ్చిరెడ్డి ,పట్టాభిరామ్, ప్రభాకర్, ఆకుల లక్ష్మణ్ , జితేందర్ ,గణేష్ ముదిరాజ్, మహేష్ యాదవ్, రాము, శ్రీనివాస్, కృష్ణ, కిషోర్, మొదలగు వారు పాల్గొన్నారు.



# ఎమోషనల్‌గా అభిషేక్ బచ్చన్ 'కాళిధర్ లపతా' ట్రైలర్

బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'కాళిధర్ లపతా'. దైవిక్ భగేలా, జీషన్ అయూబ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మధుమిత దర్శకత్వం వహించగా.. జీ స్టూడియోస్ బ్యానర్‌పై నిర్మించింది. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం థియేటర్‌లలో విడుదల కాకుండా నేరుగా ఓటీటీలోకి రాబోతున్న విషయం తెలిసిందే. ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో జూలై 4న స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.ఈ ట్రైలర్ చూస్తుంటే.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఒక కాళిధర్ అనే వృద్ధుడి చుట్టూ తిరుగుతుంది. ఆస్తి కోసం తన కుటుంబం తనను వదిలించుకోవాలని అనకుంటుందని తెలుసుకున్న ఆ వృద్ధుడు ఇంటి నుండి ఎవరికి తెలియకుండా పారిపోతాడు. ఈ క్రమంలో, అతనికి ఎనిమిదేళ్ల అనాథ అయిన బల్లుతో ఊహించని పరిచయం అవుతుంది. అయితే బల్లు పరిచయం అయ్యాకా అతడి జీవితంలో జరిగిన సంఘటనలు ఏంటి. కాళిధర్ ఫ్యామిలీ అతడిని కనిపెడుతుందా.. అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# నా బాడీ నా ఇష్టం..

కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ ఎంత స్ట్రైట్ ఫార్వార్డ్ అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనకు సంబంధించిన ఏ విషయం అయిన నిర్మొహమాటంగా చెప్పేస్తుంది. మల్టీ టాలెంటెడ్ అయిన శృతి హాసన్ టీనేజ్‌లో ఉన్నప్పుడే సింగర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టింది. ఆ తర్వాత స్వయంగా ఎన్నో ఆల్బమ్‌లను కూడా రూపొందించింది. ఈ క్రమంలోనే 'హే రామ్' అనే చిత్రంలో చిన్న పాత్రతో నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ లక్ అనే హిందీ చిత్రంలో నిపించింది. ఇక, తెలుగులో వచ్చిన 'అనగనగా ఓ ధీరుడు'తో శృతి హీరోయిన్‌గా జర్నీని స్టార్ట్ చేసింది. అయితే పవన్ కళ్యాణ్ సరసన నటించిన గబ్బర్ సింగ్ చిత్రం శృతి హాసన్ ఫేట్‌ని మార్చేసింది అని చెప్పాలి.కుర్ర హీరోలతోనే కాకుండా సీనియర్ హీరోలతో కూడా శృతి హాసన్ సినిమాలు చేస్తుంది. ఆ మధ్య ప్రభాస్‌తో 'సలార్', బాలకృష్ణతో 'వీరసింహారెడ్డి', చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' మూవీలతో హ్యాట్రిక్ హిట్లు కొట్టింది. త్వరలో సలార్2తో సందడి చేయనుంది. అయితే కెరీర్ పరంగా శృతికి పెద్ద సమస్యలేమి లేవు కాని పర్సనల్ లైఫ్‌లోనే డిస్ట్రబెన్స్ ఎక్కువ అవుతుంది. అప్పట్లో విదేశీ గాయకుడు మైకేల్ కోర్సలేతో డేటింగ్ చేసిన ఈ అమ్మడు అతడిని కమల్ హాసన్‌కు పరిచయం కూడా చేసింది. దాంతో శృతి హాసన్, మైకేల్ కోర్సలే పెళ్లి చేసుకుంటారని అంతా అనుకోగా, కొద్ది రోజులకే వీళ్లు బ్రేకప్ చెప్పుకున్నారు.మైకేల్‌తో విడిపోయిన తర్వాత శృతి హాసన్.. డూడుల్ ఆర్టిస్టు అయిన శాంతను హజారికాతో ప్రేమాయణం కొనసాగించింది. అతడితో ఎంజాయ్ చేసిన ఫొటోలు అన్ని కూడా సోషల్ మీడియాలో షేర్ చేసేది. అతడితో రొమాంటిక్‌గా గడిపింది. కాని ఎందుకో ఏమో శాంతనుకు శృతి హాసన్ బ్రేకప్ చెప్పేసింది. అయితే తాజాగా శృతి హాసన్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. టీనేజ్ లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చకపోవడంతో 'సర్జరీ' చేయించుకున్నాను అని తెలిపింది. ఇక ముఖం మరింత అందంగా కనిపించేందుకు పిల్లర్స్ కూడా వాడాను. కొంత మంది వీటిని బయటకి చెప్పుకోవడానికి ఇష్టపడరు. వాళ్ళ నిర్ణయాన్ని గౌరవిస్తాను కానీ నాలా ధైర్యంగా చెప్పే వాళ్ళని ఎందుకు తప్పుపడతారో అర్థం కాదు. అవసరమైతే ఫ్యూచరల్‌లో 'ఫేస్ లిఫ్ట్' కూడా చేయించుకుంటానేమో. అవి పూర్తిగా నా వ్యక్తి గత నిర్ణయాలు. ఇతరులకీ ఇబ్బంది లేనప్పుడు నా శరీరం విషయంలో నేను ఏ నిర్ణయమైన తీసుకుంటాను అని పేర్కొంది

**రేపు అది కూడా చేయించుకుంటానన్న శృతి హాసన్**



# అతడు నా కాలేజ్ ఫ్రెండ్.. కానీ ఇప్పుడు నాకు ఇష్టమైన హీరో..

## త్రిష కామెంట్స్..

హీరోయిన్ త్రిష.. సౌత్ ఇండస్ట్రీలోని స్టార్ హీరోయిన్లలో ఆమె ఒకరు. దాదాపు 20 ఏళ్లుగా సినీరంగంలో చక్రం తిప్పుతున్న ఏకైక హీరోయిన్. వర్షం సినిమాతో తెలుగు వారి హృదయాలు గెలుచుకున్న ఈ బ్యూటీ.. 41 ఏళ్ల వయసులోనూ ఇండస్ట్రీలో యాక్టివ్ గా ఉంటుంది. ఇప్పటికీ ఏమాత్రం తరగని అందంతో వెండితెరపై మెస్మరైజ్ చేస్తుంది. ప్రస్తుతం తమిళంలో వరుస సినిమాల్లో నటిస్తూ కట్టిపడేస్తుంది ఈ వయ్యారి. ఇటీవలే విడాముయార్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రాలతో హిట్స్ అందుకుంది. అలాగే ఇటీవలే థగ్ లైఫ్ సినిమాతో మరోసారి థియేటర్లలో సందడి చేసింది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి జోడిగా విశ్వంభర చిత్రంలో నటిస్తుంది. అలాగే తెలుగు, తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటిస్తుంది. అయితే గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఓ టాలీవుడ్ హీరో గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది.టాలీవుడ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం స్టార్ హీరోలలో ఒకరు తన కాలేజీ ఫ్రెండ్ అని.. ఆ సమయంలోనే ఇద్దరికీ పరిచయం ఉందని తెలిపింది. ఇక ఇప్పుడు అతడు స్టార్ హీరో అయ్యాడని..తనకు ఇష్టమైన స్టార్ హీరో అని చెప్పుకొచ్చింది. ఇంతకీ త్రిష చెప్పిన హీరో ఎవరో తెలుసా.. ? అతడే సూపర్ స్టార్ మహేష్ బాబు. అవును.. నిజమే.. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న త్రిష మాట్లాడుతూ.. తాను, మహేష్ బాబు చెన్నైలో కాలేజ్ ఫ్రెండ్స్ అని తెలిపింది. ఇద్దరికీ మ్యూచువల్స్ ఫ్రెండ్స్ ఉండేవారని.. వారి కారణంగా మహేష్ బాబుతో పరిచయం ఏర్పడిందని.. ఆ సమయంలో ఇద్దరం యాక్టర్స్ అవుతామని అసలు అనుకోలేదని తెలిపింది. అప్పట్లో ఇద్దరి మధ్య హాయ్, బాయ్ అనే ఫ్రెండ్షిప్ మాత్రమే ఉండేదని.. కానీ ఇప్పుడు తనకు ఇష్టమైన హీరోలలో మహేష్ ఒకరని తెలిపింది.త్రిష, మహేష్ కలిసి పలు చిత్రాల్లో నటించారు. వీరిద్దరి కాంబోలో వచ్చిన సైనికుడు సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో అమాయకమైన పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనిపించింది.





**ప్రేమ విఫలమైనప్పుడు మాత్రం బాధ భరించలేకపోయా**



తెలుగమ్మాయి అనన్య నాగళ్ల మంచి నటి మాత్రమే కాదు, మంచి మనసున్న అమ్మాయి కూడా. తన సంపాదనలో ఎంతో కొంత చారిటీలకే ఖర్చు చేస్తూవుంటుంది. మల్లేశం, వకీల్‌సాబ్, పొట్టేల్ చిత్రాల ద్వారా టాలీవుడ్‌లో తనకంటూ ఓ గుర్తింపును సాధించింది అనన్య నాగళ్ల. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన తొలిప్రేమ బ్రేకప్ విశేషాలను అనన్య నాగళ్ల పంచుకున్నది. 'కెరీర్‌లో పొగడ్తలు, తెగడ్తలు సహజం. అన్నింటినీ అలవాటు చేసుకున్నా.కానీ వ్యక్తిగత జీవితంలో ప్రేమ విఫలమైనప్పుడు మాత్రం బాధ భరించలేకపోయా. నేను ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన కొంత కాలానికే నాకు బ్రేకప్ అయ్యింది. రెండేళ్ల పాటు మనసులో ముల్లులా ఆ బాధ గుచ్చుకుంటూనే ఉంది. అయితే.. వర్క్‌పై మాత్రం ఆ ప్రభావం పడనిచ్చేదాన్ని కాదు. రాత్రంతా ఏడ్చేదాన్ని. ఉదయాన్నే జిమ్‌కెళ్లిపోయేదాన్ని. షూటింగ్ టైమ్‌లో కారవాన్‌లో ఏడ్చేదాన్ని. షాట్ అవ్వగానే ఏం జరగనట్టు బయటకొచ్చేదాన్ని. ఈ విషయం ఇప్పటివరకూ ఇంట్లోవాళ్లకు కూడా తెలియదు. స్నేహితులకు మాత్రమే తెలుసు.' అంటూ చెప్పుకొచ్చింది అనన్య నాగళ్ల.

# 'కుబేర'కు భారీ ఓపెనింగ్స్

## తొలిరోజే రూ.13 కోట్లు

విలక్షణ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో స్టార్ హీరో ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం కుబేర. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. అయితే ఈ చిత్రం విడుదలైన తొలిరోజే తెలుగు, తమిళ భాషల్లో కలిపి ఏకంగా రూ.13 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో మొదటి రోజు థియేటర్లు 57.36 శాతం ఆక్యుపెన్సీతో నిండిపోయినట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. అయితే ఈ కలెక్షన్లు వీకెండ్‌లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మరోవైపు తొలిరోజు వసూళ్లను బట్టి చూస్తే, ఇది ధనుష్ కెరీర్‌లో రెండో బిగ్గెస్ట్ ఓపెనింగ్ కలెక్షన్ కావడం విశేషం. అంతకుముందు ధనుష్ నటించిన రాయన్ చిత్రం తొలిరోజే రూ.15 కోట్ల వసూళ్లను రాబట్టింది.

Edited, printed and owned by **BHIROJU KISHORE CHARY,** printed at **SHIVA KESHAVA PRINTERS** ,FLAT NO .30, BLOCK NO.8, RAJEEVHEELS JAGATH-GIRIGUTTA QUTHBULLAPUR, MEDCHAL,(MALKAJGIRI)editor BHIROJU KISHORE CHARY,RNI Regn No TELTEL 2021/81472